క్లుప్తంగా

శ్రీనివాస్‌కు మాజీ ఎమ్మెల్యే కిషోర్ నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ సోదరుడు, సాహితీ బిల్డర్స్ వ్యవస్థాపకుడు మొరిశెట్టి శ్రీనివాస్ దశదినకర్మను గురువారం హైదరాబాద్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ హాజరయ్యారు. శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, నాయకులు కాపా వెంకటేశ్వరరావు, కొప్పుల సోమిరెడ్డి, నర్సింగ వెంకన్న, సందీప్, నాగరాజు తదితరులు ఉన్నారు.

శానిటరీ న్యాప్‌కిన్స్ అందజేత



శానిటరీ న్యాప్‌కిన్లను అందజేస్తున్న పవర్ యువర్ ఫ్లో ఆర్గనైజేషన్ సభ్యులు

సూర్యాపేట : బాలభవన్‌లో సమ్మర్ క్యాంప్‌నకు హాజరయ్యే బాలికలకు 'పవర్ యువర్ ఫ్లో' ఆర్గనైజేషన్ ద్వారా ఆర్గనైజేషన్ సభ్యుడు ప్రమోద ప్రవీణ్ కుమార్ గురువారం ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలభవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణ రెడ్డి, సిబ్బంది ఉమ పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేయాలి

తుంగతుర్తి : తెలంగాణ రాష్ట్రంలో టీడీపీని బలోపేతం చేయాలని భువనగిరి పార్లమెంటరీ అడహక్ కమిటీ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రాం భనేశ్ అన్నారు. గురువారం తుంగతుర్తిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో, 15 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసుగుచెందారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకార రమేష్, నాయకులు కూరం లింగయ్య, నూతి సత్యనారాయణ, పులుసు శేఖర్, రాములు, చంద్రయ్య యాదవ్, లింగరాజు, వెంకటేశ్వర్లు, నరేష్, మహేష్, వీరస్వామి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ప్రత్యేక తనిఖీలు



డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న ఎస్ఐ

అర్వపల్లి : నకిరేకల్ ప్రాంతంలో గురువారం మహిళ మెడలో నుంచి దొంగలు గొలుసును చోరీ చేసుకొని పారిపోయారు. అయితే దొంగలు అర్వపల్లి రూట్లో వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తుగా నకిరేకల్–తానంచర్ల హైవేపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వాహనాలను ఆపి సోదాలు చేశారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు జరిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదుచేశారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇతర వాహన పత్రాలు లేనివారికి జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు రామకోటి, రాములు, హెడ్‌కానిస్టేబుల్ సోమయ్య, సిబ్బంది రమణ, ఎ.సతీష్, పి.సతీష్, అశోక్, అన్వర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



మల్లేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

అర్వపల్లి : తెలంగాణ వడ్డెర మేలుకొలుపు సంఘం మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అర్వపల్లికి చెందిన ఆలకుంట్ల మల్లేష్, ఉపాధ్యక్షుడిగా ఓర్సు వెంకన్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలకుంట్ల బాలకష్ట, రాష్ట్ర కార్యదర్శి బండారి రాజు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతు వేదికలో సామగ్రి చోరీ

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలంలోని జానలదిన్నెలో గల రైతు వేదికలో సామగ్రి చోరీపై గురువారం మండల వ్యవసాయ అధికారులు నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఓ జావీద్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం జానలదిన్నె గ్రామంలోని రైతు వేదికను సందర్శించినప్పుడు టేబుల్, అల్మారా ఉందని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు రైతు వేదికలో సామగ్రి అపహరించినట్లు తమకు సమాచారం అందడంతో వెళ్లి పరిశీలించగా తలుపులు ధ్వంసం చేసి ఉన్నట్లు పేర్కొన్నారు. గతంలో కూడా రైతు వేదిక తలుపులను ధ్వంసం చేసి ఫ్యాన్లు, మోటారు, ట్యూబ్ లైట్లు, చైర్లు, కరెంటు మీటార్ వైర్, ఫైల్స్‌ను చోరీ చేశారని తెలిపారు.

వారంలోగా కొనుగోళ్లు పూర్తిచేయాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



మద్దిరాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



చిన్ననెమిలలో వన నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

మద్దిరాల : వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా ధాన్యం నాణ్యతను, రికార్డులను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి కావాల్సిన లారీలను పంపిస్తామని, త్వరగా కాంటాలు వేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఇప్పటికి వరకు 5700 క్వింటాల ధాన్యాన్ని తరలించామని నిర్వహకులు కలెక్టర్‌కు తెలిపారు. చిన్ననెమిల గ్రామంలో ఉపాధిహామీ పనులతో తవ్వుతున్న చేప పిల్లల పెంపకం చెరువును సందర్శించారు. ఉపాధిహామీ పనుల ప్రదేశంలో మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం చిన్ననెమిల గ్రామంలో ఉన్న వన నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఏపీఓ గుండు వెంకన్న, అధికారులు, సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు వింత రోగాలు

- ప్రబలుతున్న చర్మ వ్యాధులు
- రోగాలబారిన పడిన కుక్కలు జనావాసాల్లోనే సంచరిస్తున్న వైనం
- భయాందోళన చెందుతున్న ప్రజలు



మండల కేంద్రంలో వ్యాధిసోకిన వీధి కుక్క

చివ్వెంల : గ్రామాల్లో వీధి కుక్కలకు సోకుతున్న చర్మవ్యాధులతో ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. గత నెల రోజులుగా వీధి కుక్కలకు కొత్తరోగం అంటుకుంది. కుక్కల చర్మంపై బొచ్చు ఊడిపోవడం, దద్దుర్లు రావడంతోపాటు చిన్న చిన్న పుండ్లు ఏర్పడుతున్నాయి. పశువులకు లంపీస్కిన్ వైరస్ సోకినట్లు, ఈ వ్యాధి ఒకదాని నుంచి మరొక దానికి వ్యాపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. పశు వైద్య సిబ్బంది లెక్కల ప్రకారం మండలంలో దాదాపు 15 వందల కుక్కలు ఉన్నాయి. వీటిలో చాలా కుక్కలు ప్యారసైట్ ఇన్ఫెస్టేషన్ వ్యాధి బారిన పడ్డాయి. ఇది రెండు రకాలుగా ప్రభావం చూపుతోంది. వాటి శరీరంపై బొచ్చు ఊడిపోయి, గజ్జి లాంటి దద్దుర్లు వస్తున్నాయని, కడుపు, లివర్‌లో ఇన్‌ఫెక్షన్లు ఏర్పడుతున్నాయని పశు వైద్యాధికారులు చెబుతున్నారు.

రోగ నివారణకు చర్యలు శూన్యం..

వ్యాధిబారిన పడిన కుక్కలకు ట్రీట్‌మెంట్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ప్రస్తుతం ఈ వ్యాధి బారిన పడిన కుక్కలు చాలా ఉన్నాయి. దాదాపు ఆరు నెలల పాటు వైరస్ వాటి శరీరంపై ప్రభావం చూపుతోంది. పశు వైద్యశాలలకు మందుల సరఫరా లేక చికిత్స అందించే పరిస్థితి లేదు.

పిల్లలు, వృద్ధులకు ప్రమాదం

మా ఊరిలో చాలా రోజులుగా కుక్కల శరీరం మీద ఉన్న బొచ్చు ఊడిపోతుంది. రాలిపోయిన చోట పురుగులు ఉంటున్నాయి. అవి నివాసాల్లోకి రావడంతో పిల్లలు, వృద్ధులకు అంటువ్యాధులు ప్రభలే ప్రమాదం ఉంది.

– ఎండీ. రఫీ, చివ్వెంల

చర్యలు తీసుకుంటాం

వీధి కుక్కలకు చర్మ సంబంధ రోగాలు వ్యాప్తి చెందిన మాట వాస్తవమే. ఆ వ్యాధి నివారణకు వారం రోజులపాటు కుక్కలకు ఇంజక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. వీధి కుక్కలకు ఇంజక్షన్లు వేయాలంటే డాగ్ క్యాచర్లు ఉండాలి.

– సంతోష్ కుమార్, పశు వైద్యాధికారి, చివ్వెంల

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం వివరాలు అందించాలి

నాగారం : భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా 'రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య' కోసం తమ భూ వివరాలను అందించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.కృష్ణకాంత్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే 20వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధులు విడుదల కావాలంటే ఈ రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరి అన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు నంబరు, మొబైల్ నంబరు అందజేయాలని సూచించారు. రైతుల మొబైల్ నంబర్‌కు మూడు ఓటీపీలు వస్తాయని, ఆ వివరాలను సంబంధిత ఏఈఓలకు అందించినట్లయితే 11 అంకెలతో కూడిన రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య అందజేయబడుతుందని తెలిపారు.

పైపులకు మరమ్మతు చేయాలి

చివ్వెంల : పగిలిన మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని కోరుతూ బి.చందుపట్లలో గురువారం గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామం నుంచి తిమ్మాపురం వైపు వెళ్లే మిషన్ భగిరథ పైపు లైన్ గత కొద్ది రోజులుగా పగిలి నీరు వృథాగా పోతుందని తెలిపారు. దీనికి తోడు నీరంతా మురుగు నీటిగా మారి ఇళ్లలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించిన సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాష్పంగు సునీల్, ఎర్ర సుమన్, గోగుల వెంకన్న, ఉపేందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో భారీ వర్షం

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూర్ మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. పలు గ్రామాల్లో ఉన్న ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం తడవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఉరుములు, మెరుపుల కారణంగా మండల వ్యాప్తంగా కరెంట్ సరఫరా నిలిపివేశారు.

కోడూరులో పశు వైద్యశిబిరం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కోడూరులో బుధవారం పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 100 పశువులకు పరీక్షలు జరిపి టీకాలు వేశారు. రైతులు తమ పశువులకు తప్పనిసరిగాటీకాలు వేయించాలని వైద్యసిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం పశు వైద్యశాల వీఎల్‌ఓ కేఎస్ఎస్ పద్మ, ఓఎస్ మధుసూదన్, గోపాలమిత్ర ఆల్దాస్ లింగయ్య, రైతులు నిద్ర శ్రీధర్, బొర్రయ్య, వెంకన్న, అంజయ్య, బాకు మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వహించొద్దు



పెన్‌పహాడ్ : అనాజీపురంలోని కొనుగోలు కేంద్రంలో కాంటాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ



మద్దిరాల : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

పెన్‌పహాడ్ : ధాన్యం కొనుగోళ్లలో నిర్వాహకులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ వేణు మాధవ్ అన్నారు. గురువారం అనాజీపురం గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రానికి ధాన్యం తెచ్చిన వెంటనే నాణ్యత ప్రమాణాలను పరిశీలించి కాంటాలు వేయాలని సూచించారు. లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. సాధ్యమైనంత త్వరగా కాంటాలు పూర్తయ్యేలా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లాలు, నిర్వాహకురాలు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కాంటాలను త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ అమీన్ సింగ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రామచంద్రాపురంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటలతో అధిక ఆదాయం



కొమ్మాలలో కరపత్రాలతో ప్రచారం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి

అర్వపల్లి : ఆయిల్‌పామ్ తోటల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి అన్నారు. కొమ్మాల గ్రామంలో గురువారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని, ఆయిల్‌పామ్ తోటలను సాగుచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ జూనియర్ మేనేజర్ వి.శశికుమార్, క్షేత్ర సహాయకుడు రంగు ముత్యంరాజు, రైతులు వెంకట్ రెడ్డి, వీరారెడ్డి, సోమిరెడ్డి, వెంకటయ్య, ఉదయ్, నర్సింహారావు, కోటేష్, లింగయ్య, శ్రీనివాస్, ప్రభాకర్‌తోపాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

అంతరపంటగా కోకో సాగు..

మునగాల : ఆయిల్‌పామ్ తోటల్లో అంతరపంటగా కోకో సాగు చేస్తూ రైతులు అదనపు ఆదాయాన్ని పొందుతున్నారని పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ మేనేజర్ జె.హరీష్ తెలిపారు. మునగాల మండల కేంద్రంలో రైతు ఎంవీరెడ్డికి చెందిన ఆయిల్‌పామ్ తోటలో నాలుగు సంవత్సరాల క్రితం అంతరపంటగా కోకో పంట సాగు చేయగా ప్రస్తుతం వచ్చిన దిగుబడిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ.. రైతు ఎంవీరెడ్డి ఆయిల్‌పామ్ సాగు చేసి ఎకరాకు 10 టన్నుల పంట దిగుబడితో ఆదాయం పొందుతున్నట్లు తెలిపా రు. నాలుగేళ్ల క్రితం ఇదే తోటలో కోకో పంట సాగు చేసినట్లు పేర్కొన్నారు. ఎకరం తోటలో 110 నుంచి 130 కోకో మొక్కలు నాటారని, మూడు సంవత్సరాల తర్వాత కోకో పంట దిగుబడి ప్రారంభవుతుందని తెలిపారు. అంతరపంట సాగుతో ఎకరానికి అదనంగా రూ.30 వేల ఆదాయం పొందినట్లు వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి శ్రీనివాస్, కౌలు రైతు ఉప్పుల సీతారెడ్డి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ జూన్4కు వాయిదా



మాట్లాడుతున్న మల్లేపాక అనిల్

నాగారం : మండల పరిధిలోని పసునూర్ గ్రామంలో ఈ నెల 17న జరిగే అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్‌ల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం జూన్ 4వ తేదీకి వాయిదా పడినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కళామండలి అధ్యక్షుడు మల్లేపాక అనిల్‌కుమార్ మాదిగ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అత్యవసరంగా ఢిల్లీకి వెళ్తున్న సందర్భంగా అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం జూన్ 4కు నిర్ణయించినట్లు తెలిపారు. విద్యావంతులు, ఉద్యోగులు, మేధావులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులు మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు పోతరాజు వెంకన్న, మల్లేపాక గణేష్, బొజ్జ ఎల్లయ్య, మల్లేపాక కిరణ్, బొజ్జ నాగరాజు, బొజ్జ వెంకన్న, నరాల పాపయ్య, ఆరెంపుల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.2.50లక్షల క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రి అందిస్తున్న ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, నల్లగొండ జిల్లా కార్యదర్శి అమీన్‌బాబా

సూర్యాపేట : సూర్యాపేట జిల్లాలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరానికి రెండున్నర లక్షల విలువ చేసే క్రికెట్ మ్యాట్, కిట్లు, కసరత్తు సామగ్రి, వివిధ ఆట వస్తువులను గురువారం నల్లగొండ జిల్లా కార్యదర్శి అమీన్ బాబా, ఏఎస్పీ మేకల నాగేశ్వర రావు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని క్రీడాకారులు జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో, జాతీయస్థాయిలో ఆటగాళ్లుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా హెచ్‌సీఏ కార్యదర్శి అమీనుద్దీన్, నల్లగొండ జిల్లా కోచ్ షఫీ ఉద్దీన్, జిల్లా కోచ్ షేక్ ఉస్మద్, ట్రస్మా కార్యదర్శి సంతోష్ కుమార్, సాయి, క్రాంతి, టీచర్ జిల్లేపల్లి జానయ్య పాల్గొన్నారు.

వన నర్సరీ, కొనుగోలు కేంద్రం పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ అప్పారావు

తుంగతుర్తి : వేసవిలో మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీరందించాలని జెడ్పీ సీఈఓ అప్పారావు నిర్వాహకులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని నర్సరీని సందర్శించి మాట్లాడారు. మొలకలు రాని బ్యాగ్‌లలో మళ్లీ గింజలు నాటాలని, ఎదుగుతున్న మొక్కలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతిరోజూ గడ్డిని తొలగించాలని, వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రం నీరు పోయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు తెచ్చిన ధాన్యానికి వెంటనే కాంటాలు వేసి మిల్లులకు తరలించాలని అన్నారు. వారి వెంట ఎంపీడీఓ శేషు కుమార్, ఎంపీపీ సందీప్, ఏపీఓ కృష్ణ, ఏపీఎం కొమ్ము రాంబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా శ్రీభక్తాంజనేయ స్వామి శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



రథంపై ఊరేగిస్తున్న స్వామివారి విగ్రహం

తాళ్లగడ్డ (సూర్యాపేట) : ఈ నెల 18 నుంచి 22 వరకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో జరిగే శ్రీహనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం హనుమాన్ దీక్ష భక్త బృందం, హనుమాన్ చాలీసా పారాయణ భక్త బృందం ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఉంచి పట్టణ పుర వీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్య నిర్వహణ అధికారి లక్ష్మణరావు, కొత్త ఆంజనేయులు, మందిర అర్చకులు దరూరి శ్రీరామానుజాచార్యులు, దరూరి శ్రీధర ఆచార్యులు, భక్తులు పబ్బా ప్రకాశరావు, గోపారపు రాజు, పబ్బా రామమూర్తి, కొత్త వెంకటేశ్వర్లు, తన్నీరు వాసుదేవ్, తోట లచ్చయ్య, కొత్త రజని, కుక్కడపు కృష్ణమూర్తి, దేవేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న దాసు, పాల్గొన్న కార్మికులు

సూర్యాపేట అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం రూ.26 వేలకు పెంచి, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ – మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. దాసు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశానికి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 50వేల మందికి పైగా ఉన్న జీపీ కార్మికులను గత సర్కార్ మోసం చేసిందన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, దాసరి శ్రీను, లక్ష్మణ్, బండారు సైదులు పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఎం లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ సైదులు, సిబ్బంది

అర్వపల్లి : సరస్వతీ నది పుష్కరాల సందర్భంగా సూర్యాపేట డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జి.లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ బి.సైదులు తెలిపారు. ఈ మేరకు అర్వపల్లిలో గురువారం ప్రత్యేక బస్సుల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 26 వరకు ఈ బస్సులు నడవనున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది ఎం.భాస్కర్, ఎస్.వీరయ్య, ఘని, నాయకులు బైరబోయిన రామలింగయ్య, కుదురుపాక ఉదయ్, ఆంజనేయులు, రాంమూర్తి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : ప్రస్తుత వేసవిలో వడదెబ్బ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నడిగూడెం పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్.హరినాథ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. గత కొద్ది రోజులుగా వేడి గాలులు వీస్తున్నందున ప్రజలు ఎండలో తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర వైద్యం కోసం స్థానిక పల్లె దవాఖానాలో సంప్రదించాలని తెలిపారు.

సాండ్ ట్యాక్సీ విధానంతో రూ.21 లక్షల ఆదాయం



క్వారీ నుంచి రవాణా అవుతున్న ఇసుక

అర్వపల్లి : సాండ్ ట్యాక్సీ విధానం సక్సెస్ కావడంతో జాజిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీకి మంచి ఆదాయం సమకూరుతోంది. మండలంలోని తుంగగూడెం గ్రామంలో మూసీనది నందు ఇసుక రీచ్‌ను కేటాయించారు. ఈ విధానంలో ఏడు మండలాలకు ఇసుక రవాణా జరుగుతోంది. మన ఇసుక–మన వాహనం పేరుతో ఇసుక రవాణా 6 నెలల నుంచి చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 21 వేల ట్రాక్టర్ల ఇసుక రవాణా జరుగగా జాజిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీకి సుమారు రూ.21లక్షల ఆదాయం సమకూరింది. అలాగే ఈ పథకం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.కోటి వరకు ఆదాయం వచ్చింది. ఈ పథకాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సహకారంతో స్థానిక తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

'లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు'



మునగాలలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మునగాల : మునగాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, అనర్హులైన కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు మంజూరు చేశారని ఆరోపిస్తూ గురువారం బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు కందిబండ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జాబితాలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పార్టీ సానుభూతిపరుల పేర్లే ఉన్నాయని, అర్హులైన నిరుపేదలకు మొండిచేయి చూపారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పక్షపాత వైఖరితో లబ్ధిదారుల ఎంపిక చేపట్టిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలోనూ కాంగ్రెస్ పార్టీ నాయకులే ఉన్నారని అన్నారు. మునగాలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే సమగ్రంగా చేయలేదని ఆరోపించారు. పూర్తిస్థాయిలో సర్వే చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఉడుం కృష్ణ, నల్లపాటి నాగేశ్వరరావు, ఎల్‌పి.రామయ్య, ఎల్.నాగబాబు, వల్లోజు వసంతకుమార్, రాజేష్, షేక్ సైదా, నారగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

తుంగతుర్తి : తుంగతుర్తి మండలం పరిధిలోని వెంపటిలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాదరబోయిన రవి, ఉపాధ్యక్షుడిగా పుల్లూరి రమేష్, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల మహేష్, కోశాధికారిగా ఐతరాజు అంజయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సగ్గం నర్సయ్య, దాయం సోమిరెడ్డి, అబ్బగాని సత్యనారాయణ గౌడ్, కొండ వెంకన్న, సూదగాని రాజయ్య, జెట్టి సోమయ్య, భాషబోయిన వెంకన్న, కొండ నర్సయ్య, దేవరపు నాగరాజు, దేవరపు రమేష్ పాల్గొన్నారు.

పెరుగన్నం, పులిహోర పంపిణీ

నేరేడుచర్ల : పట్టణానికి చెందిన తాళ్లూరి రాజ్యలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె భర్త తాళ్లూరి వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులు తాళ్లూరి లక్ష్మీనారాయణ– శ్రీదేవి, మోహన్‌చందన్, మని చందన్‌లు, ప్రముఖ వ్యాపారి పాలిశెట్టి ఈశ్వరయ్య భార్య నిర్మల పుట్టినరోజు, వనితా క్లబ్ అధ్యక్షురాలు గరిణె జ్యోతి పుట్టిన రోజు సందర్భంగా గురువారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నేరేడుచర్ల వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో పేదలకు మజ్జిగ, పులిహోర, పెరుగన్నం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాతలు పాల్గొన్నారు.